సాక్షి నారాయణపేట

సోమవారం । 4 । సెప్టెంబర్ । 2023



లాంచీ.. రెడీ

కృష్ణానదిలో పర్యాటకులు విహరించేందుకు పర్యాటక శాఖ లాంచీలు సిద్ధమయ్యాయి.

వివరాలు 8లో ▸



పోలీస్ సబ్‌డివిజన్..

వేగంగా విస్తరిస్తున్న జడ్చర్లలో పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 26.4 /23.1

రోజులో అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన ఎమ్మెల్యే



నారాయణపేట: హైదరాబాద్‌లోని **సీఎం క్యాంప్ కార్యాలయంలో** నారాయణపేట **ఎమ్మెల్యే** ఎస్.రాజేందర్‌రెడ్డి ఆదివారం కలిశారు. **తనకు** మరోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసేం**దుకు అవ**కాశం కల్పించడంతో సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందించి ధన్యవాదాలు తెలిపారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి



మద్దూరు: అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని వికారాబాద్ అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ప్రజలకు సూచించారు. అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త పునరీక్షణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మద్దూరు మండలంలోని దమ్‌గాన్‌పూర్‌లో పోలింగ్ స్టేషన్ నెంబర్ 58 నుంచి 61 వరకు ఆయన పరిశీలించారు. అక్కడున్న బీఎల్‌ఓల నుంచి ఓటరు నమోదు కార్యక్రమం, తప్పుల సవరణ ఏవిధంగా కొనసాగుతుందని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్‌గౌడ్, గ్రామ బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ధన్వాడలో అత్యధిక వర్షపాతం

నారాయణపేట: జిల్లాలో ఆదివారం అత్యధికంగా ధన్వాడలో 70.0 మి.మీ., అత్యల్పంగా మాగనూర్ మండలంలో 9.6 వర్షపాతం నమోదైంది. దామరగిద్ద మండలంలో 67.7 మి.మీ., నారాయణపేట మండలంలో 41.4 మి.మీ., ఊట్కూర్‌లో 29.6 మి.మీ., క్రిష్ణ 13.6 మి.మీ., నర్వలో 21.6 మి.మీ., మరికల్ 48.2 మి.మీ., ఘద్దూర్‌లో 26.0 మి.మీ., కోస్గిలో 49.6 మి.మీ., గుండుమాల్‌లో 48.4 మి.మీ., కొత్తపల్లి మండలంలో 48.0 మి.మీ. వర్షం కురిసింది.

రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపిక

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ అధ్యాపక అవార్డు జిల్లాలో ముగ్గురికి వరించింది. ఇందులో పాలమూరు యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం హెచ్‌ఓడీ చంద్రకిరణ్ రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. అలాగే పీయూ అఫ్లియేషన్ కళాశాలల్లో ఎంవీఎస్ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు తిరుపతయ్య, ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు ముంతాజ్ జహాన్ సైతం ఎంపికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగే అవార్డుల ప్రదానోత్సవంలో కార్యక్రమంలో వీరికి ఉత్తమ అధ్యాపక అవార్డులు ప్రదానం చేయనున్నారు.

ముదిరాజ్‌ల హక్కుల సాధనకు పోరాటం



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ముదిరాజ్‌లు తమ హక్కుల సాధన కోసం పోరాటానికి సిద్ధం కావాలని ముదిరాజ్ చైతన్య వేదిక అధ్యక్షురాలు పుష్పలత అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల జనాభా ఉన్న ముదిరాజ్‌లు వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ టికెట్ ఒక్కటి కూడా ఇవ్వకుండా ముదిరాజ్‌లను అవమానించారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ముదిరాజ్‌ల సత్తా ఏమిటో బీఆర్ఎస్ పార్టీకి చూపించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగానే అక్టోబర్ 1న హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ముదిరాజ్‌ల అలాయ్–బలాయ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం అలాయ్ బలాయ్ కార్యక్రమ వాల్‌పోస్టర్ విడుదల చేశారు.

రంగనాథస్వామి కల్యాణం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం రంగనాథస్వామి ఆలయంలో రేవతి నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆదివారం అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి తిరుకల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

రైతన్నకు భరోసా..

పీఎం కిసాన్ మాన్‌ధన్ యోజనతో అన్నదాతలకు పింఛన్



నర్వలో పొలం దున్నుతున్న రైతు

సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతులకు 60 ఏళ్ల తర్వాత ఆర్థిక భరోసా కల్పించేందుకు పీఎం కిసాన్ మాన్‌ధన్ యోజన పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకంలో చేరాలనే రైతులు 18 ఏళ్ల నుండి 40 ఏళ్ల వయస్సు వారికి సూచించిన మేరకు ప్రీమియాన్ని సీఎస్‌సి సెంటర్‌లలో చెల్లించాలి. పూర్తిగా సమాచారం తెలుసుకొని ఈ పథకానికి అర్హులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– జాన్‌సుధాకర్, డీఏఓ

- గరిష్టంగా రెండు హెక్టార్ల సాగు భూమి అర్హత
- 18– 40 ఏళ్ల వయస్సు వారికి పథకం వర్తింపు
- చిన్నపాటి చందాతో వృద్ధాప్యంలో ఆర్థిక భరోసా
- జిల్లాలో మొత్తం 2.20లక్షల మంది రైతులు

నర్వ: వయస్సు పైబడిన రైతులకు సామాజిక భద్రత కల్పించేలా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ మాన్‌దాన్ యోజన పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకానికి గరిష్టంగా 2 హెక్టార్ల వరకు సాగు భూమి కలిగి 18–40 సంవత్సరాల్లోపు వయస్సున్న రైతులు అర్హులుగా గుర్తించారు. అధికారులు, ఉద్యోగులు, వైద్యులు, న్యాయవాదులు, ఇంజినీర్లు ఇతరత్రా వృత్తి నిపుణులు ఈ పథకానికి అనర్హులు. ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారు ఇతరత్రా నిర్దేశితం కన్నా అధిక రాబడిని పొందుతున్న వారు, ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందిన వారు పథకంలో చేరరాదు. వీరిని మినహాయిస్తే జిల్లాలో దాదాపుగా 80 వేల మంది రైతులు అర్హులుగా ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. పీఎం కిసాన్ సమృద్ధి యోజనలో లబ్ధి పొందుతున్న రైతులు సుమారు 80వేలు ఉన్నారు.

వయస్సును బట్టి ప్రీమియం

రైతులు 60 సంవత్సరాల వయస్సు నిండే వరకు కిస్తీ కట్టాలి. పథకంలో చేరే వారికి వయస్సును బట్టి ప్రీమియం ఉండగా రైతు చెల్లించిన మేరకు ప్రభుత్వం కూడా తనవంతుగా బీమా కంపెనీకి చెల్లిస్తుంది. ఉదాహరణకు 18 సంవత్సరాల రైతు తన వాటాగా రూ.55 చెల్లిస్తే కేంద్రం తన వాటాగా రూ.55ను కలిపి బీమా కంపెనీకి రూ. 110 చెల్లిస్తుంది. 18 ఏళ్ల వారికి ప్రీమియం రూ. 55 ఉండగా ఏటా వయస్సును బట్టి రూ.3 నుంచి రూ.10 వరకు పెరుగుతుంది. 40 ఏళ్ల వారికి రూ. 200 ప్రీమియం ఉంది.

నమోదు ఇలా..

రైతులు కామన్ సర్వీస్ సెంటర్లలో తమ పేర్లను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చు. రైతు ఫొటో, నివాస ధృవీకరణ, ఆదాయం వయస్సు నిర్ధారణ, సాగు భూమి, ఆధార్ తదితర పత్రాలను సమర్పించాలి. అన్ని వివరాలను కేంద్ర పీఎంకేఎం పోర్టల్‌లో నమోదు చేసిన తరువాత రైతులకు సమాచారం వస్తుంది. ప్రత్యేకమైన పింఛన్ అప్‌లోడ్ చేసినందుకు సేవా కేంద్రానికి రూ.30 రుసుమును కేంద్రమే చెల్లిస్తుంది. ప్రతి నెలా సదరు కేంద్రంలోనే కిస్తీని చెల్లించవచ్చు. నెలావారీగా లేదా 3, 4, 6 మాసాలకోసారి కిస్తీలు చెల్లించే వెసులుబాటుంది. పథకంలో చేరిన రైతు మరణిస్తే వారి జీవిత భాగస్వామి పథకాన్ని కొనసాగించవచ్చు. 60 సంవత్సరాల వయస్సు నిండిన తరువాత రూ.3వేల చొప్పున పింఛన్‌ను అందిస్తారు. వయస్సు నిండిన తరువాత రైతు మరణిస్తే జీవిత భాగస్వామికి సగం పింఛన్‌ను ఇస్తారు. పథకాన్ని కొనసాగించేందుకు గాను కనీసం ఐదేళ్లపాటు రైతు తనవాటా ప్రీమియంను నిర్దేశిత తేది ప్రకారం చెల్లించాలి. పీఎం కేఎం యోజన పూర్తిగా స్వచ్ఛందం. భాగస్వామ్య పింఛన్ పథకం కాబట్టి రైతులు పూర్తి వివరాలు తెలుసుకుని ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని డీఏఓ సురేష్‌కుమార్ సూచించారు.

బీఎల్‌ఓలు అందుబాటులో ఉండాలి



నర్వలో ఓటరు నమోదు ప్రక్రియపై ఆరా తీస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

నర్వ/మక్తల్/మరికల్: ఓటరు నమోదు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉండాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. ఆదివారం మండలంలోని పాథర్చేడ్, నర్వ ఓటరు నమోదు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు మండలంలో చేపట్టిన ఓటరు నమోదు ప్రక్రియను ఆయన తహసీల్దార్ రాజగణేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల నమోదులో మార్పులు, చేర్పులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఓటర్ల తొలగింపులో తప్పకుండా జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. వారం రోజుల పాటు బీఎల్‌ఓలు ఇంటింటికి తిరిగి ఓటరు జాబితాలో చేపట్టినమార్పు, చేర్పులకు అనుగుణంగా పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి నమోదు ప్రక్రియపై ఆరా తీశారు. ఈ తనిఖీలో ఆయన వెంబడి తహసీల్దార్ రాజగణేష్, రెవిన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలున్నారు.



మాద్వార్‌లో ఓటరు జాబితాలో తప్పొప్పులపై ఇంటింటి సర్వే చేస్తున్న బీఎల్‌ఓలు

అర్హులను ఓటర్ జాబితాలో చేర్చాలి

మరికల్ తహసీల్దార్ కార్యాలయంలో చేపట్టిన ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాన్ని ఆదివారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులను ఓటరు జాబితాలో చేర్చే పక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. తప్పులు లేకుండా ఓటరు జాబితా ఉండాలని, అలాగే మృతి చెందిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. తహసీల్దార్ సునిత, అధికారులు లతరెడ్డి, గోపాల్‌రావు, సుధకార్‌రెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

⇨ మక్తల్ మండలంలోని మాద్వార్, లింగంపల్లి, కర్ని, మంతన్‌గోడ్, జక్లేర్, మక్తల్ గ్రామాలతో పాటు మరి కొన్ని గ్రామాల్లో ఓటరు నమోదు, మార్పులు చేర్పులకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేశారు.

15 నుంచి ‘పాలమూరు’ నీటి పంపింగ్

- విజయవంతమైన మొదటి పంపు డ్రైరన్
- వరద జలాలను ఎత్తిపోసి రిజర్వాయర్లలోకి నీటిని విడుదల చేస్తామన్న సీఎస్



ఎల్లూరు పంపుహౌజ్‌లో ఏర్పాటు చేసిన పూజల్లో సీఎస్ రజత్‌కుమార్, ఈఎన్‌సీ మురళీధర్, సలహాదారు పెంటారెడ్డి తదితరులు

కొల్లాపూర్/ కొల్లాపూర్ రూరల్/ బిజినేపల్లి: పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టులో ప్రధానమైన ఎల్లూరు పంప్‌హౌజ్‌లో ఆదివారం మధ్యాహ్నం డ్రైరన్ నిర్వహించారు. నీటిపారుదల శాఖ సీఎస్ రజత్‌కుమార్, ఈఎన్‌సీ మురళీధర్ సమక్షంలో అధికారులు మొదటి మోటార్‌కు డ్రైరన్ చేపట్టగా విజయవంతమైంది. దీంతో పంప్‌హౌజ్‌లో ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది సంబరాలు చేసుకుని స్వీట్స్ తినిపించుకున్నారు. ముందుగా పంప్‌హౌజ్‌లో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ డ్రైరన్ విజయవంతం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఎల్లూరు పంపుహౌజ్‌లో మోటార్ల బిగింపు ప్రక్రియ జరుగుతోందని చెప్పారు. ఈనెల 15న 145 మెగావాట్ల సామర్థ్యం గల ఒక పంపుతో ఎల్లూరు పంప్‌హౌజ్ నుంచి వెట్‌రన్ (నీటి ఎత్తిపోతలు) ప్రారంభిస్తామని వెల్లడించారు. ప్రతిరోజు 3 వేల క్యూసెక్కుల నీటిని నార్లాపూర్ రిజర్వాయర్‌కు తరలిస్తామన్నారు. వరద జలాలు వృథాగా పోకుండా వినియోగించుకోవాలనే ఉద్దేశంతోనే ప్రాజెక్టు నిర్మాణం చేపట్టామని వివరించారు.

▪ తిమ్మాజీపేట మండలంలోని గుమ్మకొండ వద్ద ప్యాకేజీ–12లో భాగంగా చేపడుతున్న జరుగుతున్న మిషన్ భగీరథ పైపులైన్ పనులు, మొదటి పంపు ద్వారా నీటిని తరలించేందుకు ఏర్పాటు చేసిన తాత్కాలిక పైపులైన్ పనులను కలెక్టర్ ఉదయ్‌కుమార్‌తో కలిసి వారు పరిశీలించారు. గుమ్మకొండ శివారులో మిషన్ భగీరథ పైపులైన్ డైవర్షన్ పనులు పూర్తి కావొచ్చాయని చెప్పారు. తిమ్మాజీపేట, బిజినేపల్లి మండల శివారులో సేకరించాల్సిన 4 ఎకరాల భూమి సేకరణ విషయమై ప్రశ్నించగా హైకోర్టులో ఉన్న ఆ భూమికి అధికారులు ఇప్పటికే అన్ని రకాల క్లియరెన్స్‌లు తీసుకున్నారని, త్వరలోనే కాల్వ పనులు పూర్తి చేస్తామన్నారు.

పెంటారెడ్డిది గోల్డెన్ హ్యాండ్

లిఫ్టు ఇరిగేషన్ స్కీం సలహాదారు పెంటారెడ్డి, ఈఎన్‌సీ మురళీధర్‌పై సీఎస్ రజత్‌కుమార్ ప్రశంసలు కురిపించారు. పెంటారెడ్డిది గోల్డెన్ హ్యాండ్ అని కొనియాడారు. ఉమ్మడి ఏపీలోని పలు ప్రాజెక్టులతో పాటు కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టుల్లో ఆయన భాగస్వామ్యం ఉందన్నారు. ఆయన పనిచేసిన అన్ని ప్రాజెక్టులు సక్సెస్ అయ్యాయని పేర్కొన్నారు. పాలమూరు ప్రాజెక్టు కోసం మురళీధర్ కూడా ఎంతో శ్రమించారన్నారు. నీటిపారుదల శాఖ ఇంజినీర్లకు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు సీఈ హమీద్‌ఖాన్, ఎస్‌ఈ ఏఎస్ఎన్ రెడ్డి, ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈలు శ్రీనివాసులు, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎస్పీ వెంకటేశ్వర్లు

- ఎన్నికల నేపథ్యంలో సమస్యలు సృష్టించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచండి
- ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు

నారాయణపేట: పోలీసులు అందరూ ఎన్నికల సంఘం నియంత్రణ, పర్యవేక్షణ, క్రమ శిక్షణ లోబడి బాధ్యతగా పనిచేయాలని ఎస్పీ ఎస్.వెంకటేశ్వర్లు సూచించారు. రాబోయే శాసనసభ ఎన్నికల సందర్భంగా పోలీసు అధికారులు ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు, చేపట్టాల్సిన చర్యలపై జిల్లా పోలీసు అధికారులకు ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఆదివారం నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు తమ విధులు నిర్వర్తించాలని తెలిపారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాలు మక్తల్, నారాయణపేట ఉన్నాయని, కోస్గి, మద్దూర్ మండలాలు వికారాబాద్ జిల్లా పరిధిలోకి వస్తాయన్నారు. రెండు నియోజకవర్గాలకు ఇద్దరు డీఎస్పీలు ఇంచార్జీలుగా ఉండి బందోబస్తు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో పోలీసు అధికారులు ఎన్నికల ముందు, తర్వాత తీసుకోవాల్సిన చర్యలు క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి


ఎన్నికల సందర్భంగా పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా సమస్యలు సృష్టించే వారిని బైండోవర్ చేయాలని ఎస్పీ పేర్కొన్నారు. ఇంతకు ముందు ఎన్నికల సమయంలో సమస్యలు సృష్టించే వారిపై పూర్తి నిఘా ఏర్పాటు చేయాలని చెప్పారు. పోలీసు అధికారులు ఎలక్షన్ సమయంలో సమస్యలు సృష్టించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలను విధిగా పర్యటిస్తూ గ్రామాలపై దృష్టిసారించాలని తెలిపారు. జిల్లా ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌ప్రకారం బందోబస్తు తయారు చేసుకోవాలని కోరారు. పోలింగ్ రోజు పోలింగ్ స్టేషన్ల దగ్గర 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. అందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా పరిధిలో దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పాత నేరస్తులపై పకడ్బందీగా నిఘా ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు. పెండింగ్ కేసులను వెంటనే ట్రేస్ అవుట్ చేయాలని అధికారులకు సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌ను బాధితులు సద్వినియోగం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు, డీసీఆర్‌బి డీఎస్పీ వెంకటేశ్వర రావు, సీఐలు రవి బాబు, శ్రీకాంత్‌రెడ్డి, రాంలాల్, జనార్ధన్, రాజేందర్ ఎస్‌ఐలు ఎలక్షన్ సెల్ టీమ్ మొదలగు వారు పాల్గొన్నారు.

రంగంలోకి.. లిక్కర్ కింగ్‌లు

మద్యం దుకాణాలకు బినామీల సునామీ

‘కల్వకుర్తిలోని ఓ మద్యం దుకాణాన్ని ఓ వ్యాపారి రూ.కోటి గుడ్‌విల్ చెల్లించి కొనుగోలు చేసినట్లు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది. అలాగే వీపనగండ్లలో లక్కీడిప్‌లో దుకాణం వచ్చిన వ్యక్తికి రూ.60 లక్షలు ఇస్తాం.. దుకాణం ఇవ్వాలని బేరసారాలు చేస్తున్నారు. జడ్చర్లతోపాటు మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో ఉన్న ఒకట్రెండు దుకాణాలు ఇప్పటికే గుడ్‌విల్ ద్వారా చేతులు మారినట్లు తెలుస్తోంది. గుడ్‌విల్‌పై ఆసక్తి చూపిన వారికి వ్యాపారులు పెట్టుబడి మేము భరించి.. మీకు భాగస్వామ్యం కల్పిస్తాం అంటూ ఆశలు కల్పిస్తున్నారు.’ ఇక కొందరు అయితే సిండికేట్‌గా ఏర్పడి దుకాణాలు నడిపించే పనిలో పడ్డారు.

- ఇతరుల నుంచి దక్కించుకునేందుకు గుడ్‌విల్ పేరిట వల
- కల్వకుర్తిలో రూ.కోటి వెచ్చించి కొనుగోలు చేసిన ఓ వ్యాపారి?
- ప్రాంతాన్ని, డిమాండ్‌ను బట్టి రేట్లలో మార్పులు
- లోలోపల జోరుగా సాగుతున్న బేరసారాలు



మహబూబ్‌నగర్ క్రైం: కొత్త మద్యం దుకాణాలు డిసెంబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయి. అయితే ఇటీవల మద్యం దుకాణాలు లక్కీడిప్ ద్వారా ఇతరులకు దక్కిన వాటిని చేజిక్కించుకునేందుకు లిక్కర్ కింగ్‌లు రంగంలోకి దిగారు. ఇప్పటికే పాత దుకాణాల్లో డిమాండ్ ఉన్న వాటిలో అంటిపెట్టుకోవడానికి గుడ్‌విల్‌తోపాటు ప్రత్యేక షేర్‌లు అడుగుతున్నారు. కల్తీ మద్యం విక్రయాల్లో ఆరితేరిన కొందరు వ్యాపారులు గుడ్‌విల్ ఇచ్చి ఎలాగైనా దుకాణాలు తమ ఆధీనంలోకి తీసుకోవాలనే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఒక్కో దుకాణానికి రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు గుడ్‌విల్ చెల్లించేందుకు ముందుకొస్తున్నారు. ఈ వ్యాపారంలో ఆ స్థాయిలో లాభాలు ఉన్నాయా అనే చర్చ మరోసారి ఇటు వ్యాపారుల్లో, అటు ప్రజల్లో సాగుతోంది. కల్తీ మద్యంలో ఆరితేరిన వ్యాపారులే దుకాణాలు కైవసం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

భారీ స్థాయిలో విక్రయాలు..

ఉమ్మడి జిల్లాలోని 230 మద్యం దుకాణాలలో విక్రయాలు గణనీయంగా ఉన్నాయి. ఏళ్లుగా మద్యం వ్యాపారంలో ఆరితేరిన వ్యక్తులే ఇక్కడ వ్యాపారాన్ని నడిపిస్తున్నారు. ఈసారి దుకాణాలు లక్కీడిప్‌లో ఇతరులకు దక్కినా.. లాభాలు రుచిమరిగి ఉండటంతో పాత వ్యాపారులు మళ్లీ తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో ఉండే బెల్టు షాపులకు దుకాణాల నుంచే మద్యం సరఫరా చేస్తారు. అయితే ప్రభుత్వం అందించే మద్యం విక్రయిస్తే ఎక్కువగా లాభం ఉండకపోవడంతో ఈ బెల్టు దుకాణాలు కల్తీ మద్యం విక్రయాలకు అడ్డాగా మారాయి. కల్తీ మద్యాన్ని కొందరు వ్యాపారులే సరఫరా చేస్తున్నారనేది బహిరంగ రహస్యం. ఉమ్మడి జిల్లాలోని కొందరు మద్యం వ్యాపారులకు మహారాష్ట్రలోని నాందేడ్, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల్లో కల్తీ మద్యం తయారుచేసే వ్యాపారులతో సంబంధాలు ఉండటంతోనే ఉమ్మడి జిల్లాలో కల్తీమద్యం ఏరులై పారుతోందనే ఆరోపణలు ఉన్నాయి. మరికొన్నిచోట్ల మండలాల్లోనే మద్యం వ్యాపారులు తమ పలుకుబడి ఎక్కువగా ఉండే గ్రామాలను కల్తీ చేసేందుకు ఎంచుకుంటున్నారు. మద్యంలో రంగునీళ్లు కలిపి అన్ని బెల్టు షాపులకు పంపిణీ చేస్తున్నారు. బ్రాండెడ్ మద్యం సీసాల సీల్ విప్పి తిరిగి వేసే యంత్రాలు సైతం కొందరి దగ్గర ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ వ్యాపారంలో పేరుగాంచిన వ్యక్తులు అధిక లాభాలు ఉండటం వల్ల దుకాణాలు ఎవరికి వచ్చినా తమ ఆధీనంలోకి తీసుకునేందుకు పావులు కదుపుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..	
మొత్తం మద్యం దుకాణాలు : 230	దాఖలైన టెండర్లు 8,595
ప్రభుత్వానికి సమకూరిన ఆదాయం రూ.171.90 కోట్లు	

ఇతర ప్రాంతాల వారిపై ఒత్తిడి..

ఉమ్మడి జిల్లాలో ఇతర ప్రాంతాలకు చెందిన వారికి కొన్ని మద్యం దుకాణాలు వరించాయి. ఇందులో జిల్లాకు చెందిన కొందరు వ్యక్తులు దుకాణాలు వచ్చిన ప్రాంతాల్లో మద్యం విక్రయించడానికి కొంత షేర్ కావాలంటూ వారిపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే సామాన్యులు దక్కించుకున్న దుకాణాలను సైతం కైవసం చేసుకునే పనిలో లిక్కర్ డాన్‌లు బిజీగా ఉన్నారు. రెండేళ్లపాటు మీకు సక్రమంగా నిర్వహించడానికి రాదని.. మీకు ఎంతో కొంత ఇస్తాం.. వ్యాపారం మేము చేస్తాం అంటూ నయానో.. భయానో సొంతం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

చట్టప్రకారం నేరం..

లక్కీడిప్‌లో దుకాణం సొంతం చేసుకుని రిజిష్టర్‌లో సంతకం చేసిన వారి పేరిటే లైసెన్స్ ఇస్తాం. నవంబర్ 25 వరకు కొత్త దుకాణదారులకు లైసెన్స్ జారీ చేస్తాం. గుడ్‌విల్ ఇచ్చి దుకాణాలు తీసుకోవడం చట్టప్రకారం నేరం. అలా చేసుకున్న వారికి దుకాణంపై ఎలాంటి హక్కులు ఉండవు. ఎక్సైజ్ శాఖ నుంచి లైసెన్స్ తీసుకున్న వారే మద్యం దుకాణాలు నడపాలి. అమ్మకాల్లో ఏదైనా సమస్య వస్తే మద్యం దుకాణ లైసెన్స్ ఎవరి పేరుపై ఉంటే వాళ్లే బాధ్యులు అవుతారు. భవిష్యత్‌లో ఎలాంటి ఘటనలు జరిగినా లైసెన్స్ ఉన్న వ్యక్తులపైనే చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

– దత్తరాజ్‌గౌడ్, ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్

క్లుప్తంగా

బైక్ ఢీకొని గొర్రెల కాపరి దుర్మరణం

పెద్దకొత్తపల్లి: తప్పిపోయిన తన గొర్రెలను వెతుకుతుండగా కొత్తపేట స్టేజి వద్ద రోడ్డు దాటుతుండగా బైక్‌ఢీకొనగా ముష్టిపల్లి కృష్ణయ్య(53) తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు. కొత్తపేటకు చెందిన కృష్ణయ్య గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తుండేవాడు. శనివారం రాత్రి తప్పిపోయిన గొర్రెలను వెతకడానికి కొత్తపేట సమీపంలో ఉన్న రైస్‌మిల్ వద్ద కృష్ణయ్య రోడ్డు దాటుతుండగా బైక్‌పై కొల్లాపూర్ వెళ్తున్న అశోక్ ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య నిర్మలమ్మ, కొడుకు శివకుమార్ ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

పారిపోయిన యువకుడు.. ప్రమాదంలో మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: పని చేయడం లేదని తల్లిదండ్రులు మందలించినందుకు మూడు నెలల క్రితం ఇంటి నుంచి పారిపోయిన యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి ఆదిబట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట్ మండలం, జానంపేట్‌కు చెందిన పల్లి శివకుమార్(21) ఇంటర్ చదివి ఇంటి వద్దే ఉంటున్నాడు. తల్లిదండ్రులు మందలించడంతో ఇంటి నుంచి పారిపోయి వచ్చాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి కర్నూల్ జిల్లా డోన్ నుంచి కరీంనగర్‌కు టమాటా లోడ్‌తో వెళ్తున్న బొలేరో వాహనాన్ని పంచలింగాల సమీపంలో శివకుమార్ లిఫ్ట్ అడిగి ఎక్కాడు. అర్ధరాత్రి 12గంటల సమయంలో బొంగ్లూరు జంక్షన్ వద్ద ఎగ్జిట్ నంబర్–12 వద్ద వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో వాహనం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సుధాకర్‌కు స్వల్ప గాయాలు కాగా, శివకుమార్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం మార్చురీలో భద్రపరిచారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఇసుక టిప్పర్

- చికిత్స పొందుతూ కండక్టర్ మృతి
- టిప్పర్‌ను ఢీకొన్న బైక్ : కోమాలోకి యువకుడు

జడ్చర్ల: మండలంలోని బూర్గుపల్లి గేటు సమీపంలో శనివారం రాత్రి ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వచ్చిన ఓ ఇసుక టిప్పర్ వేగంగా ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కండక్టర్ ఖయ్యూమ్(46) మృతి చెందారు. ఎస్‌ఐ నాగరాజు కథనం మేరకు.. కొల్లాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి కొల్లాపూర్‌కు వెళ్తుండగా బూర్గుపల్లి గేటు సమీపంలో ఆకస్మికంగా సాంకేతిక కారణాలతో ఆగిపోయింది. కొద్ది సేపటి తర్వాత నాగర్‌కర్నూల్ వైపు వెళ్లేందుకు వచ్చిన మరో బస్సును ఆపి కండక్టర్ ఖయ్యూమ్ ప్రయాణికులను అందులో ఎక్కించారు. అనంతరం రెండు బస్సుల మధ్యన నిల్చుని బస్సు లైట్ వెలుతురులో ఎస్‌ఆర్ రాసుకుంటున్నాడు. ఈ సమయంలో ఇసుక లోడ్‌తో వేగంగా వచ్చిన టిప్పర్ వెనుక నుంచి ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. దీంతో రెండు బస్సుల మధ్యలో ఉన్న కండక్టర్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స కోసం అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతిచెందిన కండక్టర్ వనపర్తికి చెందినవాడు. బస్సు డ్రైవర్ ఖాజమైనద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. టిప్పర్‌ను వదిలేసి డ్రైవర్ భయంతో పారిపోయాడు.

టిప్పర్‌ను ఢీకొట్టిన బైక్

జడ్చర్ల నుంచి తిమ్మాజిపేట మండలం గుమ్మకొండకు చెందిన సంగెం నరేష్‌రెడ్డి (26)మోటర్ బైక్‌పై ఇంటికి వెళ్తుండగా రోడ్డుపై ప్రమాదానికి కారణమైన టిప్పర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా కోమాలోకి వెళ్లాడు.

లాంచీ.. రెడీ

కృష్ణానదిలో లాంచీల ప్రయాణానికి అనువుగా నీటిమట్టం

- నదీతీర ప్రాంతాలు తిలకించేందుకు విచ్చేస్తున్న పర్యాటకులు
- సోమశిల పరిసరాల్లో ప్రారంభమైన మినీ లాంచీల చక్కర్లు
- త్వరలోనే శ్రీశైలం ప్రయాణం సైతం అందుబాటులోకి..
- ధరలలో మార్పుల కోసం అధికారుల చర్యలు



శ్రీశైలం టూర్‌కు వినియోగించే ఏసీ లాంచీ

కొల్లాపూర్: ఇటీవల కురిసిన వర్షాలకు కృష్ణానదికి వరదలు రావడంతో శ్రీశైలం ప్రాజెక్టులో బ్యాక్‌వాటర్ క్రమంగా పెరుగుతోంది. దీంతో కృష్ణానది తీర ప్రాంతాలు ఆహ్లాదకరంగా మారాయి. నదీ అందాలతోపాటు ప్రకృతి సోయగాలను ఆస్వాదించేందుకు పర్యాటకులు విచ్చేస్తున్నారు. సోమశిల సమీపంలోని కృష్ణానదిలో పర్యాటకులు విహరించేందుకోసం పర్యాటక శాఖ లాంచీలు ముస్తాబయ్యాయి. సోమశిల సమీప ప్రాంతాలతోపాటు శ్రీశైలం వరకు నదిలో ప్రయాణాలు సాగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

పర్యాటక శాఖ ఆధ్వర్యంలో..

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిలలో పర్యాటక శాఖ రెండు లాంచీలను ఏర్పాటు చేసింది. ఎనిమిదేళ్ల క్రితం సోమేశ్వర అనే పేరుతో మినీ నాన్ ఏసీ లాంచీని ఏర్పాటు చేసి శ్రీశైలం వరకు నదీ ప్రయాణం కల్పించింది. అప్పట్లో లాంచీ ప్రయాణానికి పర్యాటకులు ఉత్సాహం చూపించారు. పర్యాటకుల తాకిడి పెరగడంతో 2019లో స్వదేశ్ దర్శన్ నిధులు రూ.2.5 కోట్లతో 120 మంది ప్రయాణించేందుకు వీలుగా మరో ఏసీ లాంచీని ఏర్పాటు చేశారు. దీనినే ప్రస్తుతం సోమశిల నుంచి శ్రీశైలం వరకు నదిలో ప్రయాణించేందుకు వినియోగిస్తున్నారు. మినీ నాన్ ఏసీ సోమేశ్వర లాంచీని మాత్రం సోమశిల పరిసర ప్రాంతాల్లోనే తిప్పుతున్నారు.

సోమశిల పరిసరాల్లో..

ఈ ఏడాది వర్షాలు సరిగా కురవకపోవడంతో నదిలోకి నీరు చేరడం ఆలస్యమైంది. కొన్ని రోజులుగా శ్రీశైలం ప్రాజెక్టుకు వరద జలాలు చేరుతుండటంతో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం సోమశిల సమీపంలో పుష్కర ఘాట్ల వద్దకు నీళ్లు చేరుకున్నాయి. దీంతో మినీ నాన్‌ఏసీ లాంచీ ప్రయాణాలను పర్యాటక శాఖ అధికారులు ప్రారంభించారు. ఇక శ్రీశైలానికి తిప్పే ఏసీ లాంచీ ప్రయాణాలు ప్రారంభమయ్యేందుకు మాత్రం కొంత సమయం పడుతుందని చెబుతున్నారు. రెండు లాంచీలను శుభ్రం చేసి నదీ ప్రయాణాలకు సిద్ధంగా ఉంచారు.

టూర్‌కు పర్యాటకుల కొరత

శ్రీశైలం లాంచీని 2019లో ప్రారంభించాక ఇప్పటి వరకు కేవలం 20 సార్లు మాత్రమే సోమశిల– శ్రీశైలం మధ్య తిప్పారు. 2019లో నాలుగు సార్లు, 2020లో 11 సార్లు తిప్పగా.. 2021లో ఒక్కసారి కూడా తిప్పలేదు. 2022లో మాత్రం 5 సార్లు లాంచీ ప్రయాణం సాగింది. శ్రీశైలానికి లాంచీలో ప్రయాణించాలంటే కనీసం 70 మంది ప్రయాణికులు ఉండాలి. లేదా రూ.1.30 లక్షలకు పైగా చార్జీల రూపంలో చెల్లించాలి. అలా అయితేనే లాంచీ ప్రయాణం ప్రారంభిస్తారు. అంతమంది ఒకేసారి రాకపోవడంతో ఆశించిన స్థాయిలో శ్రీశైలం టూర్ ప్రయాణాలు పెద్దగా సాగడం లేదు.

మినీ లాంచీకి డిమాండ్.

సోమశిల పరిసరాల్లో మాత్రమే తిప్పే సోమేశ్వర లాంచీ (మినీ నాన్‌ఏసీ లాంచీ)లో విహరించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. ఈ లాంచీలో 15 నిమిషాలపాటు తిప్పేందుకు ఒక్కో ప్రయాణికుడి నుంచి రూ.50, చిన్నపిల్లలకు రూ.30 చొప్పున వసూలు చేస్తున్నారు. 20 మంది ప్రయాణికులు జమ అయితే ఈ లాంచీని నదిలో తిప్పుతారు. ఒకవేళ ఎవరైనా రూ.4 వేలు చెల్లిస్తే గంటపాటు వారి బృందం మొత్తాన్ని నదిలో తిప్పుతారు. ఈ ధరలు తక్కువగా ఉండడంతో చాలామంది పర్యాటకులు సోమేశ్వర లాంచీలో తిరిగేందుకు ఇష్టపడుతున్నారు. ఈ లాంచీ ద్వారా పర్యాటక శాఖకు ప్రతినెలా రూ.లక్షకుపైగా ఆదాయం లభిస్తోంది. శ్రీశైలం టూర్‌కు తిప్పే ఏసీ లాంచీ ప్రయాణ చార్జీలు అధికంగా ఉండటంతో పర్యాటకులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు.



సోమశిల పరిసరాల్లో మాత్రమే తిప్పే మినీ నాన్ ఏసీ లాంచీ

శ్రీశైలం వెళ్లే ఏసీ లాంచీ ప్రస్తుత చార్జీలు ఇలా
(ఈ ధరల్లో మార్పు జరిగే అవకాశం ఉంది)

	పెద్దలకు (రూ.లలో..)	పిల్లలకు
1. హైదరాబాద్ నుంచి బస్సులో సోమశిలకు వచ్చి అక్కడి నుంచి ఈగలపెంట వరకు లాంచీలో ప్రయాణం. శ్రీశైలంలో విడిది, భోజనం. మరుసటి రోజు ఈగలపెంట నుంచి సోమశిలకు లాంచీలో చేరుకుని బస్సులో తిరిగి హైదరాబాద్ చేరుకునేందుకు చార్జీ.	4,499	3,600
2. సోమశిల నుంచి ఈగలపెంట వరకు లాంచీలో వెళ్లి మళ్లీ మరుసటి రోజు ఈగలపెంట నుంచి సోమశిల వచ్చేందుకు (టూవే) చార్జీ.	2,600	2,100
3. సోమశిల నుంచి ఈగలపెంట వరకు వెళ్లడం లేదా ఈగలపెంట నుంచి సోమశిలకు వచ్చేందుకు (వన్‌వే) చార్జీ.	2,000	1,600

పాతాళగంగ వరకు..



సోమశిల నుంచి శ్రీశైలం వరకు పర్యాటకులను తీసుకువెళ్లేందుకు ఏసీ లాంచీ ఏర్పాటు చేశారు. కానీ, ఇప్పుడు అది శ్రీశైలం వరకు కాకుండా ఈగలపెంట వద్దే ఆపుతున్నారు. అక్కడి నుంచి మరో 21 కి.మీ., మేరకు బస్సులో ప్రయాణించి శ్రీశైలం చేరుకోవాల్సి ఉంది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉన్న సరిహద్దుల కారణంగా పర్యాటక శాఖ లాంచీ పాతాళగంగ వద్దకు వెళ్లడం లేదు. పర్యాటక శాఖ అధికారులు స్పందించి పాతాళగంగ వద్దకు పర్యాటకులను చేర్చేలా చర్యలు చేపట్టాలి. అలాగే నదీ ప్రయాణంలో ఒకటి లేదా రెండుచోట్ల కొద్దిసేపు పర్యాటకులు విరామం తీసుకునేలా షెల్టర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– శ్రీనివాసులు, కొల్లాపూర్

త్వరలోనే ప్రారంభిస్తాం..



కృష్ణానదిలో పర్యాటకులు విహరించేందుకు లాంచీ ప్రయాణాలు ప్రారంభించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమశిలలోని రెండు లాంచీలను నదీ ప్రయాణాల కోసం అందుబాటులోకి వచ్చాయి. అలాగే శ్రీశైలం టూర్‌కు దాదాపుగా 70 మంది ప్రయాణికులు ఉంటేనే లాంచీ తిప్పుతాం. లేదంటే నిర్వహణ భారం మీదపడుతుంది. మినీ లాంచీ టికెట్ల ధరలో ఇప్పుడు ఎలాంటి మార్పులు లేవు. శ్రీశైలానికి తిప్పే ఏసీ లాంచీ ధరలను ఈనెలాఖరులోగా అధికారులు నిర్ణయిస్తారు.

– రాజేష్‌గౌడ్, లాంచీ నిర్వహణ పర్యవేక్షకుడు

ఆర్‌యూబీ కింద నీటిలో చిక్కుకున్న వాహనం

- ప్రమాదం నుంచి బయటపడిన నలుగురు వ్యక్తులు



వరద నీటిలో చిక్కుకున్న బొలెరో వాహనం

మహబూబ్‌నగర్ రూరల్: రైల్వే అధికారుల నిర్లక్ష్యం కారణంగా మరోసారి రూరల్ మండలం రామచంద్రాపూర్ పరిధిలోని సూగూరుగడ్డతండా సమీపంలో గల రైల్వే అండర్ బ్రిడ్జిలో భారీగా చేరుకున్న వరద నీటిలో ఓ వాహనం చిక్కుకుంది. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. సుమారు తొమ్మిది ఫీట్ల మేర నీటితో ఉన్న అండర్ బ్రిడ్జిలోకి వెళ్లిన బొలెరో వాహనం ఐదు ఫీట్ల లోతు నీటిలోకి వెళ్లగానే నిలిచిపోయింది. దాంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు వాహనాన్ని అక్కడే వదిలేసి ప్రాణాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల పొలాల రైతులు ట్రాక్టర్ సాయంతో వాహనాన్ని బయటకు తీశారు. కాగా గతంలో కూడా ఇదే రైల్వే అండర్ బ్రిడ్జిలో ఓ స్కూల్ బస్సు నీటిలో చిక్కుకోవడంతో ఆ బస్సులోని విద్యార్థులను తండావాసులు కాపాడారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నా రైల్వే అండర్ బ్రిడ్జిలో నిల్వ ఉంటున్న వరద నీటిని ఎప్పటికప్పుడు తొలగించే ప్రయత్నాలు చేయడం లేదు. రాత్రి వేళల్లో ఆ నీటిలో ఎవరైనా చిక్కుకుంటే ప్రాణాలు కోల్పోవాల్సిందే. ఇప్పటికైనా రైల్వే అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకొని ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

మహానగరంగా పాలమూరు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఒకప్పుడు వలస జిల్లాగా పేరుగాంచిన పాలమూరు ప్రస్తుతం ఎవరూ ఊహించని విధంగా మహానగరంగా విస్తరిస్తోందని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని వడ్డెర బస్తీలో రూ.10 లక్షలతో నిర్మించిన ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ యూనియన్ భవనాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక వలసలు పోయేవారని, అభివృద్ధి అంటే ఏమిటో తెలియని దుస్థితి ఉండేదన్నారు. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు నుంచి త్వరలో కర్వెన రిజర్వాయర్‌కు నీటిని తరలించి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని చెప్పారు. ఈ రంగంపై ఆధారపడిన వ్యాపారాలు కూడా పెరిగాయన్నారు. గుర్తింపు పొందిన కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం ద్వారా అండగా నిలుస్తున్నామన్నారు. అనంతరం మంత్రిని సంఘం ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, నాయకులు కృష్ణమోహన్, రవికిషన్‌రెడ్డి, అంజాద్, అనంతరెడ్డి, యూనియన్ గౌరవాధ్యక్షుడు సలీం బాషా, అధ్యక్షుడు వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

అభివృద్ధి పనుల పరిశీలన

మన్యంకొండ అలివేలుమంగ ఆలయం వద్ద మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని మంత్రి పేర్కొన్నారు. అక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనులను పరిశీలించిన ఆయన ఇప్పటికే ఉన్న కల్యాణ మండపాలకు అదనంగా మరో కల్యాణ మండపంతోపాటు వంటశాల, బాత్రూ ంలను నిర్మిస్తామని చెప్పారు. వివాహ శుభకార్యాలు జరుపుకొనే వారికి సౌలభ్యంగా ఉండేలా మరిన్ని వసతులు కల్పిస్తామన్నారు. తెలంగాణలో అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా మన్య ంకొండను తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. మంత్రి వెంట జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మ న్ రాజేశ్వర్‌గౌడ్, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి తదితరులున్నారు.

ఉత్సాహంగా యోగాసన పోటీలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని రెడ్ క్రాస్ అనాథ శరణాలయంలో ఆదివారం ఉమ్మడి జిల్లా యోగాసన పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీల్లో దాదాపు 100 మంది క్రీడాకారులు పాల్గొనగా.. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో బాల, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించి విజేతలుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి సాయికుమార్, కోశాధికారి సురేష్, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి సుగుణ, వనజారెడ్డి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో యోగాసన ప్రదర్శనలు ఇస్తున్న క్రీడాకారులు

చికిత్స పొందుతూ మృతి

అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లికి చెందిన కుమ్మరి శ్రీను(51) ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. అప్పుల బాధలు, కుటుంబ సమస్యలతో బాధపడుతున్న శ్రీను ఈనెల 1న ఇంటి వద్ద కలుపు మందు తాగాడు. కుటుంబసభ్యులు వెంటనే ఆయనను మహబూబ్‌నగర్‌లోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం ఆస్పత్రిలోనే మృతి చెందాడు. మృతుని భార్య అరుణ ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అత్యాచారం కేసులో శివకుమార్‌రెడ్డికి నోటీసులు

శివాజీనగర: మహిళపై అత్యాచారం, బెదిరింపుల కేసులో విచారణకు హాజరు కావాలని నారాయణపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డికి బెంగళూరులోని కబ్బన్‌పార్కు పోలీసులు నోటీసులు జారీచేశారు. శివకుమార్‌రెడ్డి ఒక మహిళను బెంగళూరులోని స్టార్ హోటల్‌కు పిలిపించి మత్తు మందు కలిపిన పండ్లరసం ఇచ్చి, లైంగిక దాడికి పాల్పడినట్లు కేసు నమోదైంది. అత్యాచారానికి పాల్పడి, వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్లు సదరు మహిళ కబ్బన్‌పార్క్ పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విచారణకు రావాలని పోలీసులు నోటీసులు పంపగా.. ఆయన ఒక వారం సమయం కోరారని తెలిసింది.

గుప్తనిధుల తవ్వకాలను అడ్డుకోరా?



మెటల్ డిటెక్టర్‌తో మైలారం శివాలయం వద్ద పట్టుబడిన వ్యక్తి (ఫైల్)

- మెటల్ డిటెక్టర్‌తో పట్టపగలే బంగారు కోసం అన్వేషణ
- గ్రామస్తుల్లో రేకెత్తుతున్న అనుమానాలు

బల్మూర్: ప్రాచీన కాకతీయుల కాలం నాటి ప్రఖ్యాతిగాంచిన నాగర్‌కర్నూల్ జిల్లాలోని బల్మూర్ మండలం మైలారం శివాలయంలో ఇరవై ఏళ్ల నుంచి గుప్తనిధుల కోసం దుండగులు తరచుగా తవ్వకాలు చేస్తూనే ఉన్నారు. ఈ శివాలయం గ్రామానికి దూరంగా గుట్ట వద్ద పొలాల్లో ఉండటంతో రాత్రివేళ అక్కడ ఏమి చేసినా అలికిడి వినిపించకపోవడంతో దుండగులు యథేచ్ఛగా తవ్వకాలు చేస్తున్నారు. కానీ వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోలేకపోవడంతోనే రెచ్చిపోతున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

పట్టపగలే మెటల్ డిటెక్టర్‌తో శోధన

ఇటీవల శివాలయం పరిసరాల్లో పట్టపగలే ఏకంగా మెట్ డిటెక్టర్‌తో అన్వేషిస్తుండగా గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనలో పాల్గొన్న ముగ్గురు మూడు నెలల క్రితం కూడా ఆలయంలోని రాధికామాత విగ్రహం ఎదుట గుంత తీసి గుప్తనిధి తిసుకెళ్లినట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇంతే కాకుండా ఈ ముఠానే కొంతకాలంగా పురాతన ఆలయాలనే లక్ష్యంగా చేసుకుని నల్లమల ప్రాంతంలో యంత్రాలతో గుప్తనిధుల వేట సాగిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. పట్టుబడిన వారిని విచారించి వివరాలు తెలుపకుండా పోలీసులు గోప్యంగా ఉంచ డం చర్చనీయాంశంగా మారింది. మైలారం చెందిన ఇద్దరు వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు తెలుస్తుంది. వారే శివాలయంతో పాటు ఈప్రాంతంలోని పురాతన ఆలయలను గుర్తించి కొంతకాలంగా తవ్వకాలు చేస్తున్నారనే ప్రచారం ఉంది. ఈవిషయమై పోలీసులు నిందితుల గుట్టు రట్టు చేస్తే తప్ప అనుమానాలు నివృత్తి కాని పరిస్థితి నెలకొంది.

కఠిన చర్యలు తీసుకుంటాం

మైలారం వద్ద శివాలయంలో గుప్త నిధుల వేటకు వచ్చి పట్టుబడిన వారిపై కేసు నమోదు చేశాం. అసలైన సూత్రధారులు పరారీలో ఉన్నారు. వారిని త్వరలోనే పట్టుకుంటాం. శివాలయంలో గుప్త నిధుల తవ్వకాలు చేసినట్లు గతంలో ఎవరూ ఫిర్యాదులు చేయలేదు. ఈనెల 7న తవ్వకాలకు అన్వేషిస్తున్న వారిని పట్టుకుని వారిని విచారించి కేసు నమోదు చేశాం. ఆలయాల వద్ద నిఘా కట్టుదిట్టం చేశాం.

– అనుదీప్, సీఐ, అచ్చంపేట

ముదురు నారు..

- యాజమాన్యం పద్ధతులు

పాడి-పంట
అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: నీటి విడుదలలో జాప్యం, వర్షాభావ పరిస్థితులు, బోరు బావుల కింద సాగులో సమస్యలు వివిధ కారణాలతో వరినాట్లు వేయడంలో జాప్యం అవుతోంది. ముందుగా వేసిన నారుమళ్లలో నారు ముదిరే అవకాశాలున్నాయి. ముదిరిన నారు వేసుకునే యాజమాన్య పద్ధతుల్లో కేవలం సన్నరకం వరి వంగడాలకు మాత్రమే వర్తిస్తుందని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు.

సాధారణ నారు..

సాధారణంగా 30 రోజుల నారును నాటు వేస్తారు. ఈ నారు సాలుకు మధ్య 20 సెంటిమీటర్లు, మొక్కకు మొక్కకు మధ్య 15 సెంటిమీటర్ల దూరంతో నాటుకోవాలి.

ముదిరిన నారు..

- నారు వేసి 30 రోజులు దాటితే దానిని ముదిరిన నారుగా పరిగణించాలి.
- 30 నుంచి 40 రోజుల నారును నాటేటప్పుడు సాలుకు సాలుకు మధ్య 15 సెంటిమీటర్లు, మొక్కకు మొక్కకు మధ్య 15 సెంటిమీటర్ల దూరంతో నాటాలి.
- 40 నుంచి 50 రోజుల నారును నాటేటప్పుడు సాలుకు మధ్య 15 సెంటిమీటర్లు, మొక్కకు మొక్కకు మధ్య 10 సెంటిమీటర్లు స్థలాన్ని వదలాలి.
- ముదిరిన నారు నాటేటప్పుడు నారు పిలకలు ఎక్కువగా నాటాలి. ఎందుకంటే నాటు వేయడం ఆలస్యమైంది కాబట్టి గంట తక్కువగా పోస్తుంది. అందువల్ల నారు మొక్కలు ఎక్కువగా నాటాలి.
- కుదురుకు 4 లేదా 5 మొక్కల చొప్పున నాటు వేసుకోవాలి.



వరి నారుమడి

ముదురు నారుతో వేసిన పొలానికి....!

- ముదురు నారు పొలానికి రెండు దఫాలుగా మాత్రమే ఎరువులు వేయాలి. అది కూడా రెట్టింపుతో వాడాలి.
- ముదురు నారు నాటినప్పుడు నత్రజని ఎరువు అధికంగా వాడాలని, 70 శాతం దమ్ము దశలో 30 శాతం అంకుర దశలో వాడాలి.
- భాస్వరం ఎరువు 50 శాతం పొటాష్‌తో ఎరువుతో కలిపి మొదటి సారి దమ్ములో వేయాలి. ఇలా చేయడం వల్ల పిలకలు తొందరగా వేసి దిగుబడి ఎక్కువగా ఉంటుంది.
- మొదటి దఫా(నాటు వేసే సమయంలో) 50కిలోల యూరియా, 50 కిలోల డీఏపీ, 15కిలోల పొటాష్ వేస్తే సరిపోతుంది. ఇలా చేయడంతో దిగుబడి తగ్గకుండా ఉంటుంది.

కాలి బాటలు తప్పని సరి..

వరి నాటు వేసే సమయంలో 2 మీటర్ల తర్వాత 20 సెంటిమీటర్ల చొప్పున తూర్పు, పడమరలుగా కాలి బాటలు వదలడం చాలా మంచిది. దీంతో పంటకు గాలి బాగా తగులుతుంది. పైగా తెగుళ్ల సోకకుండా ఉంటుంది. ఎరువులు, పురుగుల మందులు, కలుపు మందులు వేయడానికి ఉపయోగపడతాయి.

ఏటీఎంలో రూ.6లక్షల చోరీ



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఏటీఎంలో చోరీ జరిగింది. ఆదివారం మధ్యాహ్నం ఏటీఎం మిషన్ నిర్వాహకుడు స్వామి మిషన్ షటర్ తెరిచేందుకు వచ్చాడు. తాళాలను ధ్వంసం చేసి గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి విద్యుత్ సరఫరాలను తొలగించి రూ.6 లక్షల నగదును ఎత్తుకెళ్లినట్లు గమనించారు. ఘటనపై ఆదివారం పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐ రాజుకు ఫిర్యాదు చేయగా, క్లూస్ టీంను రప్పించి వివరాలను, వేలి ముద్రలను ఇన్‌చార్జ్ శ్రీనివాసులు సేకరించారు.

బంగారు, నగదు చోరీ

ధన్వాడ: మండలంలోని మందిపల్లిలో శుక్రవారం పట్ట పగలే చోరీ ఘటనను పోలీసులు బయటకు రానివ్వకుండా దాచిపెట్టిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఆదివారం బాధితుడు వెంకటయ్యతో పాటు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటయ్య శుక్రవారం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. తిరిగి సాయంత్రం వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్నా 3 తులాల బంగారం, రూ.80 వేల నగదు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దొంగలను పట్టుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించకపోవడం వల్లే తరుచుగా మండలంలో చోరీలు అవుతున్నాయని గ్రామస్తులు భయదోళనలు వ్యక్తం చేశారు.

పురాతన ఆలయాలకు ‘శ్రీవాణి’ వైభవం

ఏపీలో 176 పురాతన ఆలయాల పునరుద్ధరణ

తిరుమల: పురాతన ఆలయాల పునరుద్ధరణ, నూతన ఆలయాల నిర్మాణం, హిందూ ధార్మిక ప్రచార, సేవా కార్యక్రమాలే లక్ష్యంగా శ్రీవాణి ట్రస్టు ముందుకు దూసుకుపోతోంది. భక్తుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు శ్రీవాణి ట్రస్ట్ నిధులతో ఏపీలో 176 పురాతన ఆలయాలను పునరుద్ధరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 2,273 నూతన ఆలయాలు నిర్మించి పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. అలాగే 501 ఆలయాలకు ధూపదీప నైవేద్యం కింద ప్రతి నెల రూ.5 వేలు చొప్పున చెల్లిస్తున్నారు. శ్రీవాణి ట్రస్ట్ నిధులతో పెద్ద ఎత్తున హిందూ ధార్మిక ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

2019లో ట్రస్ట్ విధివిధానాలు ఖరారు: నూతన ఆలయాల నిర్మాణం, పురాతన ఆలయాల పునరుద్ధరణ కోసం టీటీడీ శ్రీవాణి ట్రస్ట్‌ను ప్రారంభించింది. 2018 ఆగస్టు 18వ తేదీనే ట్రస్ట్‌ను అప్పటి ప్రభుత్వం ప్రారంభించినా విధివిధానాలు మాత్రం 2019 సెప్టెంబర్ 23వ తేదీ ఖరారు చేశారు. అప్పటి వరకు కూడా టీటీడీ ట్రస్ట్‌లకు సంబంధించి లక్ష రూపాయలపైగా ఇచ్చిన దాతలకు మాత్రమే దర్శన సౌలభ్యం కల్పించేది. మొదటిసారి రూ.10 వేలను శ్రీవాణి ట్రస్ట్‌కు విరాళంగా అందించిన భక్తులకు ఎలాంటి సిఫార్సు లేఖలు లేకుండా ప్రోటోకాల్ బ్రేక్ దర్శన సౌకర్యం కల్పించే విధానాన్ని ప్రవేశపెట్టారు. దీంతో శ్రీవాణి ట్రస్ట్‌కు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది.

సెప్టెంబర్‌లో తిరుమలలో విశేష పర్వదినాలు



తిరుమల: కలియుగ వైకుంఠమైన తిరుమలలో సెప్టెంబర్‌లో విశేష పర్వదినాలను ఆదివారం టీటీడీ పీఆర్వో విభాగం ఒక ప్రకటనలో తెలిపింది. సెప్టెంబర్ 7న గోకులాష్టమి, 8న ఉట్లోత్సవం, 17న బలరామ జయంతి, వరాహ జయంతి, తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, 18న వినాయక చవితి, ధ్వజారోహణంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం, 22న శ్రీవారి గరుడసేవ, 23న శ్రీవారి స్వర్ణరథోత్సవం, 25న రథోత్సవం, 26న శ్రీవారి చక్రస్నానం, ధ్వజావరోహణంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు సమాప్తం, 27న శ్రీవారి బాగ్ సవారి ఉత్సవం, 28న అనంత పద్మనాభ వ్రతం జరగనున్నట్లు వెల్లడించింది.

పేదల ఇళ్లు లూటీ!

- నిరుపేదల ఈడబ్ల్యూఎస్ గృహాలనూ వదలని చంద్రబాబు
- రూ.8,000 కోట్ల ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టు షాపూర్జీ పల్లోంజీకి
- దుబాయ్ దినార్‌ల రూపంలో ముడుపులతో దొరికిపోయిన బాబు
- వినయ్ నంగాలియా, విక్కీజైన్, అంకిత్ బలదూత కీలక పాత్ర
- షాపూర్జీ పల్లోంజీ నుంచి దొంగ ఇన్‌వాయిస్‌లతో నగదును బాబు పీఏకు చేరవేసిన ఆ ముగ్గురూ
- ఐటీ శాఖ నోటీసుల్లో వెలుగులోకి చంద్రబాబు నిర్వాకాలు
- రూ.118 కోట్లకు మినహా మిగిలిన వాటికి బాబు లేఖలు
- దీటుగా సెక్షన్లతో తిప్పికొడుతూ తాజాగా 153 సీ కింద ఐటీశాఖ నోటీసులు జారీ



చంద్రబాబుకు వివిధ మార్గాల్లో అందించిన రూ.కోట్లను కోడ్ భాషలో స్టీల్ టన్నులుగా పేర్కొంటూ మెయిల్‌లో దాచుకున్న షాపూర్జీ పల్లోంజీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్

సాక్షి, అమరావతి: ఏపీ రాజధాని అమరావతి ముసుగులో తాత్కాలిక భవనాల నిర్మాణాల్లో అడ్డంగా దోచేసిన మాజీ సీఎం చంద్రబాబు నాయుడు పేదల ఇళ్ల నిర్మాణాన్ని సైతం వదల్లేదు! రూ.వేల కోట్ల విలువైన కాంట్రాక్టులను ఒకే నిర్మాణ రంగ సంస్థకు అప్పగించి భారీ మొత్తంలో దోపిడీకి వేసిన పథకం ఆదాయపు పన్ను శాఖ తాజాగా జారీ చేసిన 46 పేజీల సుదీర్ఘ నోటీసుల్లో బయటపడింది. తాత్కాలిక భవన నిర్మాణాల్లో డొల్ల కంపెనీల పేరుతో రూ.వందల కోట్లు స్వాహా చేసి పక్కా ఆధారాలతో దొరికిపోయిన చంద్రబాబు ‘ఈడబ్ల్యూఎస్’పథకం కింద పేదల ఇంటి నిర్మాణాల్లో ముడుపులు కొట్టేసేందుకు ప్రణాళిక వేశారు. ఇదే విషయాన్ని షాపూర్జీ పల్లోంజీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసాని 2019 నవంబర్ 5న ముంబైలో ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో వెల్లడించాడు. తాత్కాలిక సచివాలయం భవనాలే కాకుండా రాష్ట్రంలో వివిధ నిర్మాణాలకు సంబంధించి 2018 డిసెంబర్ నాటికి సుమారు రూ.8,000 కోట్ల విలువైన కాంట్రాక్టులను షాపూర్జీ పల్లోంజీకి చంద్రబాబు అప్పగించినట్లు మనోజ్ వాసుదేవ్ తన వాంగ్మూలంలో పేర్కొన్నాడు. ఇందులో ఈడబ్ల్యూఎస్ హౌసింగ్ ప్రాజెక్టు కింద సుమారు రూ.7,000 కోట్ల విలువైనవి కర్నూలు, గుంటూరు, అనంతపురం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఉన్నట్లు తెలిపాడు. అమరావతిలో రూ.700 కోట్ల హౌసింగ్ ప్రాజెక్టును 2019 ఫిబ్రవరిలో కేటాయించారని, దీని తర్వాతే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తనను ఇంటికి పిలిచి ఆయన పీఏ శ్రీనివాస్‌తో టచ్‌లో ఉండాలని చెప్పారని, అంతేకాకుండా పార్టీ ఫండ్ రూపంలో కాకుండా డొల్ల కంపెనీల ద్వారా తనకు నగదు ఇవ్వాలని కోరినట్లు వాంగూల్మంలో స్పష్టంగా పేర్కొన్నాడు.

2017లో షాపూర్జీ పల్లోంజీ 1.40 లక్షల ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టును దక్కించుకోగా 2019 మార్చి నాటికి కేవలం 23 వేల ఇళ్ల నిర్మాణాన్నే పూర్తి చేసింది.

నగదు బదిలీలో ఆ ముగ్గురు.. కోడ్ భాషలో

సబ్ కాంట్రాక్టుల ముసుగులో డొల్ల కంపెనీలు హయగ్రీవా, అన్నై, షలఖ కంపెనీల ద్వారా అక్రమంగా నగదును చంద్రబాబు నాయుడుకు తరలించడంలో వినయ్ నంగాలియా, విక్కీ జైన్, అంకిత్ బలదూత కీలకపాత్ర పోషించినట్లు మనోజ్ వాసుదేవ్ పార్థసాని తన వాంగ్మూలంలో వెల్లడించినట్లు ఐటీశాఖ నోటీసుల్లో పేర్కొంది. వీరంతా బోగస్ కాంట్రాక్టుల ద్వారా నగదును చంద్రబాబు నాయుడు పీఏ శ్రీనివాస్‌కు చేరవేసినట్లు పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలతో పాటు దుబాయ్‌లో దినార్‌ల రూపంలో చెల్లించినట్లు మనోజ్ వాసుదేవ్ అంగీకరించాడు. ఈ చెల్లింపులకు సంబంధించిన ఎక్సెల్ షీట్‌ను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లో నగదు బదిలీకి కోడ్ భాషలో హెచ్‌వైడీ అని అందులో ఉంది. విజయవాడకు విజయ్ అని, విశాఖపట్నంకు విష్ అని, బెంగళూరుకు బాంగ్ అని కోడ్ భాషల్లో నమోదు చేసుకున్న వివరాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

అడ్డగోలు వాదన ఆపి జవాబు చెప్పు!!

చంద్రబాబు అసంబద్ధ వాదనలను కట్టిపెట్టి ముడుపుల రూపంలో తీసుకున్న రూ.118 కోట్లకు సంబంధించి లెక్కలు చెప్పి తీరాల్సిందేనని ఐటీ శాఖ తేల్చి చెప్పింది! ఐటీ శాఖ నోటీసులు జారీ చేసిన ప్రతిసారీ తన రాజగురువు రామోజీ తరహాలో ఏదో ఒక అభ్యంతరాన్ని తెరపైకి తీసుకొస్తూ దర్యాప్తు ముందుకు కదలకుండా చంద్రబాబు అడ్డుకుంటున్నారు. చంద్రబాబు ప్రతిసారి వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను ఐటీ శాఖ తోసిపుచ్చుతూ సహనంగా సమాధానాలిస్తోంది. ముందుగా రూ.118 కోట్లకు లెక్కలు చెప్పాలంటూ పూర్తి సాక్ష్యాధారాలతో మరోసారి సెక్షన్ 153 సీ కింద నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులతో పాటు మనోజ్ వాసుదేవ్ పార్థసాని (ఎంవీపీ), చంద్రబాబు పీఏ పెండ్యాల శ్రీనివాస్‌లపై ఐటీ దాడుల సందర్భంగా స్వాధీనం చేసుకున్న ఎక్సెల్ షీట్లు, వాట్సాప్ మెస్సేజ్‌లు, ఈ మెయిల్స్, బ్యాంకు లావాదేవీల వివరాలతో పాటు వారు విచారణ సందర్భంగా ఆ నగదును చంద్రబాబుకు ఏ విధంగా చేర్చారో వెల్లడిస్తూ వివరాలను పొందుపరిచింది.

తప్పించుకుని తిరుగుతూ..

చంద్రబాబు స్క్రూటినీ కేసును హైదరాబాద్ ఇన్‌కమ్ ట్యాక్స్–4 ప్రిన్సిపల్ కమిషనర్ గతేడాది సెక్షన్ 127 కింద హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్–2(4)కు బదలాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసి సెక్షన్ 153 సీ, 143(2)/142(1) కింద విచారణకు సంబంధించి నోటీసులు జారీ చేశారు. దీనిపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ 2022 అక్టోబర్ 10, అక్టోబర్ 27, ఈ ఏడాది జనవరి 31, జూన్ 20న చంద్రబాబు నాలుగు లేఖలు రాశారు. అసలు సెంట్రల్ సర్కిల్ కార్యాలయానికి సెక్షన్ 153 సీ కింద తనకు నోటీసులిచ్చే అధికారం లేదని వాదించగా దీన్ని తోసిపుచ్చింది. దీంతో చంద్రబాబు వెంటనే సెక్షన్ 127 కింద కేసు బదిలీ కాకుండానే సెంట్రల్ సర్కిల్ ఆఫీసు తనకు నోటీసులు ఇచ్చిందంటూ వాదించగా దానికి కూడా స్పష్టమైన ఆధారాలతో వివరణ ఇచ్చింది. దర్యాప్తులో సీజ్ చేసిన వివరాలను తనకు పూర్తిగా తెలియచేయలేదని ఒకసారి పేర్కొనగా అందులో తన పేరు ఎక్కడా లేదు కాబట్టి తనకు నోటీసులు వర్తించవంటూ మరోసారి చంద్రబాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ఐటీ శాఖ స్పందిస్తూ మనోజ్ వాసుదేవ్ పార్థసాని వద్ద సోదాల్లో సీజ్ చేసిన వస్తువుల వివరాలన్నీ మీకు (చంద్రబాబుకు) తెలియచేశామని, సీఎం హోదాలో కేటాయించిన కాంట్రాక్టుల నుంచి సబ్ కాంట్రాక్టుల రూపంలో ఎటువంటి పనులు చేయకుండానే నగదు చంద్రబాబుకు చేరినట్లు బలమైన ఆధారాలను సేకరించడంతో మీ అభ్యంతరాలను కొట్టి వేస్తున్నామని, పూర్తి వివరాలను మరోసారి అందచేస్తున్నామని, దర్యాప్తునకు సహకరించాల్సిందేనంటూ తాజా నోటీసుల్లో స్పష్టం చేసింది.

స్వైన్ ‘ఫ్లూ’



- వేగంగా విస్తరిస్తున్న వైరస్
- పదేళ్లలో దేశవ్యాప్తంగా 8,064 మంది మృతి.. 1.47లక్షల మందికి సోకిన వైరస్
- స్వైన్‌ఫ్లూపై తాజాగా నివేదిక విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం
- చలికాలం వరకు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్య నిపుణులు

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా స్వైన్‌ఫ్లూ కేసులు నమోదవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తాజాగా స్వైన్‌ఫ్లూపై ఓ నివేదిక విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం 2014 సంవత్సరం నుంచి ఈ ఏడాది జూలై వరకు అంటే దాదాపు పదేళ్లలో దేశవ్యాప్తంగా 1.47 లక్షల మందికి స్వైన్‌ఫ్లూ వైరస్ సోకింది. అందులో 8,064 మంది చనిపోయినట్లు కేంద్ర నివేదిక వెల్లడించింది. ఆ వివరాలను తెలంగాణ వైద్యారోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. 2015 సంవత్సరంలో అత్యధికంగా దేశంలో 42,592 మందికి స్వైన్‌ఫ్లూ సోకగా, అందులో ఏకంగా 2,990 మంది చనిపోయారు. ఆ తర్వాత అత్యధికంగా 2017లో 38,811 మందికి స్వైన్‌ఫ్లూ వైరస్ సోకగా, అందులో 2,270 మంది చనిపోయినట్టు కేంద్ర నివేదిక తెలిపింది. 2014లో మాత్రం 937 మందికి స్వైన్‌ఫ్లూ రాగా, 218 మంది చనిపోయారు. దేశంలో వాతావరణ పరిస్థితులు, తీసుకునే జాగ్రత్తలపైనే దాని విస్తరణ, మరణాలు ఆధారపడి ఉన్నాయని ఆ నివేదిక వెల్లడించింది.

ఈ ఏడు నెలల్లోనే 2,783 కేసులు

దేశవ్యాప్తంగా ఈ ఏడాదిలో ఈ ఏడు నెలల కాలంలో 2,783 స్వైన్‌ఫ్లూ కేసులు నమోదు కాగా, 52 మంది చనిపోయారు. గతేడాది దేశంలో 13,202 మందికి సోకగా, 410 మంది చనిపోయారు. ఇవిగాక కొందరు రోగులు నేరుగా ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లడంతో అవి రికార్డుల్లోకి ఎక్కడంలేదని అంటున్నారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రులు స్వైన్‌ఫ్లూ భయం పెట్టి వేలకు వేలు గుంజుతున్నాయి. చివరకు అక్కడ తగ్గకపోవడంతో కొన్ని కేసులు ప్రైవేటు నుంచి ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. స్వైన్‌ఫ్లూపై నిరంతర అవగాహన కల్పించడం, నియంత్రణ చర్యలు తీసుకోవడమే పరిష్కారమని నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ క్రిటికల్ కేర్ విభాగాధిపతి డాక్టర్ కిరణ్ మాదల చెబుతున్నారు.

తెలంగాణలో 8,561 కేసులు

సంవత్సరం	స్వైన్‌ఫ్లూ కేసులు	మరణాలు
2014	78	08
2015	2,956	100
2016	166	10
2017	2,165	21
2018	1007	28
2019	1388	22
2020	446	05
2021	09	-
2022	343	-
2023 జూలైదాకా	03	-

(తెలంగాణవ్యాప్తంగా ఈ పదేళ్లకాలంలో 8,561 మందికి స్వైన్‌ఫ్లూ సోకగా, 194 మంది మృతి చెందారని కేంద్ర నివేదిక తెలిపింది.)

జాగ్రత్తలే శ్రీరామరక్ష...

- గుంపులున్న చోట తిరగకుండా చూసుకోవాలి. గుంపుల్లో తిరిగితే ఒకరి నుంచి మరొకరికి స్వైన్‌ఫ్లూ వైరస్ సోకే ప్రమాదముంది.
- ఎప్పటికప్పుడు చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి. అవకాశముంటే రక్షణ కవచంగా గ్లౌవ్స్ తొడుక్కోవాలి.
- దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, అధిక జ్వరం ఉండి, స్వైన్‌ఫ్లూ అనుమానం వస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.
- బీపీ, స్థూలకాయం, షుగర్, ఊపిరితిత్తుల సమస్యలున్న వారికి స్వైన్‌ఫ్లూ త్వరగా సోకే అవకాశముంది. కాబట్టి వారు జాగ్రత్తలు తీసుకోవాలి.

స్వైన్‌ఫ్లూ లక్షణాలు...

- తీవ్రమైన జ్వరం వస్తుంది. దగ్గు, జలుబు, ఒళ్లునొప్పులు ఉంటాయి. జ్వరం ఒక్కోసారి అధికంగా ఉంటుంది. తలనొప్పి కూడా తీవ్రంగానే ఉంటుంది.
- పిల్లల్లో కొన్ని సందర్భాల్లో తీవ్రమైన శ్వాస సంబంధిత సమస్య ఎదురవుతుంది. ఒక్కోసారి చర్మం బ్లూ లేదా గ్రే కలర్‌లోకి మారుతుంది. దద్దుర్లు వస్తాయి. ఒక్కోసారి వాంతులు కూడా అవుతాయి. నడవడమూ కష్టంగానే ఉంటుంది.
- ఇక పెద్దల్లో అయితే కొన్ని సందర్భాల్లో శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది. ఛాతీనొప్పి, కడుపునొప్పి కూడా ఉంటుంది. నిరంతరాయంగా వాంతులు అవుతాయి.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో



ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం సాయంత్రం 7గంటల వరకు ప్రాజెక్టుకు ఎగువ నుంచి 900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు వారు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 750 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఆవిరి రూపంలో 103, కోయిల్ సాగర్‌కు 315, కుడి కాల్వకు 646, ఆర్డీఎస్ లింకు కెనాల్‌కు 60, సమాంతర కాల్వకు 700, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 2,514 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.439 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలంలో 850.6 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో ఆదివారం 850.6 అడుగుల వద్ద, 81.4 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 2,250, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్ఎస్ఎస్‌కు 1,688, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 2.169 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 4,185 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు.

కోయిల్‌సాగర్ నీటిమట్టం 27.6 అడుగులు

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం ఆదివారం సాయంత్రం వరకు 27.6 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 32.6 అడుగులుగా ఉండగా మరో 5 అడుగుల నీరు చేరితే గేట్లు తెరిచే అవకాశం ఉంది. వానాకాలం పంటల సాగుకు నెల 1వ తేదీ నుంచి 33 రోజుల పాటు కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటిని విడుదల చేస్తూ వచ్చారు. రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో ఆదివారం ఉదయం కుడి, ఎడమ కాల్వలను మూసివేశారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టు నుంచి ఒక పంపును రన్ చేసి నీటిని కోయిల్‌సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

37.2 మి.మీ. వర్షపాతం నమోదు..


దేవరకద్ర మండలంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షాలు లేక వాడు పట్టిన పత్తి, ఆముదం, జొన్న పంటలకు ఈ వాన ఊపిరిపోసింది. మండలంలో 37. 2 మి.మీ., కౌకుంట్ల మండలంలో 38 మి.మీ. వర్షపాతం నమోదైంది.

పోలీస్ సబ్‌డివిజన్ ఏర్పాటయ్యేనా?

- రూరల్, ట్రాఫిక్ స్టేషన్ల ఏర్పాటుకు డిమాండ్
- 1.50 లక్షల జనాభాకు ఒకే పోలీస్ స్టేషన్



జడ్చర్ల పోలీస్ స్టేషన్..



జడ్చర్ల పట్టణం

జడ్చర్ల: రెండు జాతీయ రహదారులు కలయికతో పాటు పారిశ్రామికంగా, వ్యాపార వాణిజ్య పరంగా అనేక రంగాలకు సంబంధించి నిత్యం రద్దీని సంతరించుకున్న నియోజకవర్గంలో పోలీసుల సత్వర సేవల ఆవశ్యకత ఎంతైనా ఉంది. సకాలంలో పోలీసుల సేవలు అందకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ట్రాఫిక్ సమస్యలతో సతమతం..

పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకు తీవ్రమవుతుండడంతో నియంత్రణ కూడా పోలీసులే చూడాల్సి వస్తుంది. రోడ్లు ఇరుగ్గా ఉండడంతో చీటికి మాటికి రాకపోకలు స్తంభించి పోతున్నాయి. ప్రధానంగా సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో తరుచూ ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. వాస్తవంగా ఇక్కడ ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

పని భారంతో సతమతం

పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది తలకు మించిన పనిభారంతో సతమతమవుతున్నారు. సిబ్బంది కొరత వేధిస్తుంది. సెజ్‌లో పరిశ్రమల సంఖ్య పెరుగుతుండడంతో శాంతి భద్రతల సమస్యల పరిరక్షణ బాధ్యత పోలీసులపైనే ఉంటుంది. జిల్లాలోనే అధిక నేరాలు నమోదవుతున్న పోలీస్ స్టేషన్‌లలో జడ్చర్ల ప్రధానంగా ఉంది. ప్రతి సంవత్సరం దాదాపుగా 500–600 వరకు కేసులు నమోదవుతున్నాయంటే పరిస్థితిని అంచనా వేయవచ్చు. గతేడాది దాదాపు 800 పైచిలుకు కేసులు నమోదయ్యాయి. జడ్చర్లకు దాదాపు 20 కి.మీ.ల దూరంలో గ్రామీణ ప్రాంతాలు, గిరిజన తండాలు ఉండడంతో అక్కడ జరిగే వివిధ నేరాలకు సైతం పోలీసులు సకాలంలో వెళ్లాల్సి ఉంటుంది.


ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు..

పట్టణంలో పోలీస్ సబ్ డివిజన్‌తో పాటు రూరల్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణపనులకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభం కాలేదు.

రూరల్ స్టేషన్‌కు ఎదురుచూపులు..

రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ప్రజలు ఎదురుచూస్తున్నారు. దశాబ్ద కాలంగా రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ బలంగా ఉంది. పట్టణం రోజు రోజుకు నలుదిక్కులా విస్తరిస్తుండడంతో పాటు ఓ వైపు 44వ నంబర్ జాతీయ రహదారి మరో వైపు 167 నంబర్ జాతీయ రహదారి ఉన్నాయి. వీటితో పాటు మండలంలోని పోలేపల్లి శివారులో ఏర్పాటు చేసిన సెజ్, గ్రీన్ ఇండస్ట్రియల్ ఏరియాతో నియోజకవర్గ కేంద్రంగా ఉన్న జడ్చర్ల పోలీస్‌స్టేషన్ బిజీ బిజీగా మారింది. ఇటువంటి పరిస్థితులలో చోటు చేసుకుంటున్న పలు సమస్యలు సకాలంలో పరిష్కారానికి నోచుకోక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాదేపల్లి, కావేరమ్మపేట(జడ్చర్ల) జంట పట్టణంతో పాటు మండలంలోని 45 పంచాయతీలు, వాటి పరిధిలోని 23 అనుబంధ తండాలు తదితర నివాస ప్రాంతాలు ఉన్నాయి. పట్టణంలోనే దాదాపు 80 వేలకు పైగా జనాభా ఉంది.

ప్రజలకు అందుబాటులో సేవలు..



పట్టణంతో పాటు మండల ప్రజలకు సకాలంలో సేవలు అందిచేందుకు కృషి చేస్తున్నాం. మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతాలు, తండాలకు కలిపి ఒకే పోలీస్ స్టేషన్ ఉంది. రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటైతే ప్రజలకు మరింత సౌకర్యంగా ఉంటుంది.

– రమేష్‌బాబు, సీఐ, జడ్చర్ల



లారీ ఎక్కిన విమానం

సాధారణంగా విమానం ఆకాశంలో ఎగురుతుంది.. లేకపోతే విమానాశ్రయంలో ఆగుతుంది. కానీ, ఓ విమానం లారీపై ప్రయాణించడంతో ప్రజలు ఆశ్చర్యంగా చూశారు. ఆదివారం హైదరాబాద్ వైపు నుంచి విమానం తీసుకెళ్తున్న ఓ లారీ జోగుళాంబ గద్వాల జిల్లా పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఆగింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు రెక్కలు లేని విమానాన్ని ఆసక్తిగా గమనించారు. కర్నూలులో హోటల్ నిర్వహణ కోసం ఈ విమానాన్ని ఢిల్లీ నుంచి తీసుకెళ్తున్నట్లు తెలిసింది.

- ఉండవెల్లి

జోగుళాంబ ఆలయంలో నాగసాధువులు



ఆలయ ఈఓతో మాట్లాడుతున్న నాగసాధువులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను ఆదివారం నాగ(దిగంభర) సాధువులు కొంతమంది దర్శించుకున్నారు. అనంతరం కార్యాలయంలో ఆలయ ఈఓ పురేంధర్‌ను కలిసి ముచ్చటించారు.

నిజంగా నాగసాధువులేనా?

ఇటీవల కాలంలో ఒంటినిండా విభూది ధరించి దిగంబరంగా వచ్చే స్వాముల సంఖ్య పెరిగింది. కాగా వీరంతా తమకు తాము నాగసాధువులుగా పరిచయం చేసుకుంటున్నారు. ఆలయ కార్యాలయంలోకి వెళ్లడం, అక్కడి అధికారులు, సిబ్బందితో డబ్బులు వసూలు చేస్తున్నారు. అదేవిధంగా భక్తుల వద్ద నగదు తీసుకుంటున్నారు. అయితే వీరు నిజంగా నాగసాదువులేనా లేక ఈ వేశాలతో ఇలా వస్తున్నారా? అని కొంత మంది భక్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆభరణాలు భద్రమేనా?

జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారికి భక్తులు ఇస్తున్న ఆభరణాలు బ్యాంకు లాకర్లలో ఎందుకు భద్రపరచడం లేదని ఆలయ పాలక మండలి ఈఓ పురేందర్‌కుమార్‌ని కోరారు. ఇటీవల ఓ సీనియర్ ఉద్యోగి విధుల నుంచి సస్పెండ్ కాగా, ఆభరణాలు చాలా కాలంగా ఆయన ఆధీనంలోనే ఉన్నాయి. పాలక మండలి చైర్మన్ వెంటనే సదరు ఉద్యోగి రంగనాథ్‌కు ఫోన్ చేసి బంగారు ఆభరణాలు, రికార్డులు దేవస్థానంకు అప్పజెప్పాలని ఫోన్‌లో కోరగా 7వ తేదీన వస్తానని సమాధానం ఇచ్చినట్టు తెలిసింది.

కోవర్టు రాజకీయాలను సహించం!

- మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి

కందనూలు: కోవర్టు రాజకీయాలను సహించేది లేదని మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి మండిపడ్డారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రోజురోజుకు బలపడుతున్న కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసే ప్రయత్నంలో భాగంగానే ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి నీచ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలోని కొంత మంది ముఖ్య నాయకులకు తెలిసే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కాంగ్రెస్ నాయకులతో సమావేశాలు పెట్టారని ఆరోపించారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి బెదిరింపులు, గుండాయిజంలో ఎమ్మెల్సీ పాత్ర ఉందని ఆరోపించారు. నాడు కాంగ్రెస్ పార్టీ తరుపున తాను పోటీ చేస్తే, ఎమ్మెల్సీ కుటుంబం పన్నిన కుట్రలు, కుతంత్రాలతో ఓటమి పాలయ్యానని చెప్పారు. 2018 ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికై, నాటి సార్వత్రిక ఎన్నికలలో బీఆర్ఎస్‌లో చేరి, అన్ని ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించేందుకు ఆయన చేసిన కుమ్మక్కు రాజకీయాలు ఈ ప్రాంత ప్రజలకు బాగా తెలుసన్నారు. ఎన్నికుట్రలు చేసిన తాను కాంగ్రెస్ పార్టీలో ఉంటూ నియోజకవర్గంలో రెండు జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, సింగిల్ విండో ఎన్నికలలో అభ్యర్థులను గెలిపించుకున్నానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గుర్తుపై గెలిచిన నాయకులను తిరిగి పార్టీలోనే చేర్పిస్తూ.. పార్టీ నాయకులను అయోమయంలో పడేస్తున్నరని విమర్శించారు. తాను రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరి ఎన్నికల్లో పోటీ చేస్తే తన ఓటమికి బీఆర్ఎస్‌తో జతకట్టారన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యేతో విభేదాలు వచ్చి, మర్యాద ఇవ్వడం లేదని వ్యక్తిగత స్వార్థంతో కుమారుడిని కాంగ్రెస్ పార్టీలో చేర్చి, ఆయన మాత్రం బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారని ఆరోపించారు. అంతటితో ఆగకుండా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించడం ఎమ్మెల్సీకి తగదని చెప్పారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడితో పాటు పలువురు ముఖ్య నేతలు ఆయనకు వత్తాసు పలుకడం హాస్యాస్పదం అన్నారు. త్వరలోనే ప్రత్యేక కార్యాచరణతో కార్యకర్తలను సమాయత్తం చేసి తమ సత్తా చాటుతామన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, బాలగౌడ్, కోటయ్య, లక్ష్మయ్య, పాండు, పర్వతాలు, కౌన్సిలర్లు నిజాముద్దీన్, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.